క్లుప్తంగా

ఘనంగా ఆలయ ప్రారంభోత్సవం



మజ్జిగౌరీదేవి సన్నిధిలో ఎమ్మెల్యే శంబంగి

బొబ్బిలి: మండలంలోని గున్నతోటవలసలో మజ్జిగౌరీదేవి ఆలయ ప్రారంభోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు అమ్మవారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు. రాష్ట్ర ప్రజలు సుఖసంతోషాలతో చల్లగా ఉండేలా దీవించమని వేడుకున్నారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేను సన్మానించారు.

వైభవంగా గ్రామదేవత పండగ



ఆకట్టుకున్న కోలాటం

రాజాం సిటీ: మున్సిపాలిటీ పరిధిలోని పొనుగుటివలస గ్రామంలో అసిరితల్లి అమ్మవారి పండగ మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. గ్రామంలోని శాసపు ప్రసాదరావు ఇంటి నుంచి ఘటాలతో అమ్మవారి ఆలయానికి బయలుదేరి వెళ్లారు. మేళతాళాలు, కోలాటాలు, వివిధ సాంస్కృతిక కార్యక్రమాల నడుమ అమ్మవారి వనంకు చేరుకున్నారు. గ్రామదేవత పండగకు వివిధ ప్రాంతాల్లో ఉన్న గ్రామస్తులు, బంధువులు, స్నేహితుల రాకతో గ్రామంలో సందడి నెలకొంది.

సుబ్రహ్మణ్య స్వామికి ప్రత్యేక పూజలు

రేగిడి: మండలంలోని ఆమదాలవలస, రేగిడి, గోపెంపేట, అంబకండి, సంకిలి తదితర గ్రామాల్లో వెలసిన సుబ్రహ్మణ్య స్వామి ఆలయాల్లో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆమదాలవలస ఆలయ పూజారి కిన్నెరకాంతం అన్నారావు ఆధ్వర్యంలో స్వామి వారికి పంచామృతాభిషేకాలు, పుష్పార్చనలు చేశారు. పూజా కార్యక్రమాల్లో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

మద్యపానం ఆరోగ్యానికి హానికరం



ర్యాలీ చేస్తున్న ఎస్‌ఈబీ సిబ్బంది, గ్రామస్తులు

వంగర: మద్యపానం హానికరమని రాజాం స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో(ఎస్‌ఈబీ) ఎస్సైలు ఎస్.పిచ్చేశ్వరరావు, ఎం.శ్రీనివాసరెడ్డి అన్నారు. సారా తయారీ, రవాణా, విక్రయాలను అడ్డుకునేందుకు ప్రజలు సహకరించాలని కోరారు. సారా తాగి ఆరోగ్యాన్ని పాడుచేసుకోవద్దని, కుటుంబాలను వీధిన పడేయొద్దని సూచించారు. సారా తాగడం వల్ల కలిగే అనర్థాలపై ప్రజలను చైతన్యం చేశారు. అనంతరం గ్రామంలో ర్యాలీ చేపట్టారు.

జోరుగా రహదారి నిర్మాణ పనులు



కొత్తగా వేసిన తారురోడ్డు

మెంటాడ: అనకాపల్లి–రాయపూర్ గ్రీన్‌ఫీల్డ్ జాతీయ రహదారి నిర్మాణ పనులు జోరుగా కొనసాగుతున్నాయి. మండల కేంద్రం మీదుగా జరిగే ఈ నిర్మాణానికి అవసరమైన భూములను రైతులు ఇప్పటికే ఇవ్వడంతో నిర్మాణం చకచకా జరుగుతోంది. ప్రస్తుతం తారురోడ్డు వేస్తుండగా, 25 కిలోమీటర్ల మేర నిర్మాణం పూర్తయిందని సంబంధిత అధికారులు చెబుతున్నారు. వచ్చే ఏడాది వేసవి నాటికి రహదారి పూర్తిచేసి, జాతికి అంకితం చేయడం జరుగుతుందన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో పంటలకు జీవం



చాటాయవలసలో వరి పంటను పరిశీలిస్తున్న రైతులు ఏపీ కన్నబాబు

రేగిడి: మండలంలోని చాటాయవలస గ్రామంలో సుమారు 25 ఎకరాల్లో రైతులు ప్రకృతి సేద్యం విధానంలో వరి పంటను సాగు చేస్తున్నారు. నాట్లు వేసినప్పటి నుంచి పంట కోత దశకు వచ్చే వరకు పంటను తెగుళ్ల బారినుంచి రక్షించేందుకు రసాయన ఎరువులు, పురుగు మందులకు కాకుండా ప్రకృతిలో లభించే పదార్థాలతో తయారు చేసిన జీవామృతం, పత్ర కషాయాలను పిచికారీ చేశారు. పంటను చీడపీడలు, దోమపోటు నుంచి కాపాడుకునేందుకు జీవామృతం, కషాయాలు బాగా పనిచేశాయని రైతు కరణం గోవిందరావు, మాస్టర్ ట్రైనర్ కిరణ్ కుమార్, ఐసీఆర్‌పీలు పైల తవిటినాయుడు, కూనుబిల్లి రమణ తదితరులు అంటున్నారు.

ఊరూరా దసరా సందడి

బొబ్బిలి, రాజాం నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో దసరా పండగను మంగళవారం ఘనంగా జరుపుకున్నారు. విజయదశమి సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయాలకు తరలివచ్చి దుర్గామాతను దర్శించుకున్నారు. అమ్మవారి సన్నిధిలో వాహన పూజలు చేశారు. పలు గ్రామాల్లో సామూహిక కుంకుమార్చనలు, కలశపూజలు, అన్నసంతర్పణలు నిర్వహించారు.

– బొబ్బిలి/రాజాం నెట్‌వర్క్



రాజాం సిటీ: నవదుర్గ అమ్మవారికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే కంబాల జోగులు, తదితరులు



తెర్లాం: నందబలగ దుర్గాదేవి ఆలయంలో విజయదశమి పూజలకు హాజరైన ఎమ్మెల్యే శంబంగిని సన్మానిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు



రాజాం: దీపారాధనలో భక్తులు



రాజాం: కంచరాంలో పూజలు చేస్తున్న భక్తులు



రేగిడి: రేగిడిలో దసరా పూజల్లో పాల్గొన్న భక్తులు



వంగర: వీవీఆర్‌పేటలో కుంకుమ పూజలు చేస్తున్న భక్తులు



సంతకవిటి: శ్రీహరినాయుడుపేటలో వాహన పూజ చేస్తున్న భక్తులు



బాడంగి: బాడంగిలోని ఉమాసోమేశ్వరాలయంలో పూజలు చేస్తున్న భక్తులు



తెర్లాంలో దుర్గాదేవి మండపం వద్ద భక్తుల పూజలు



బొబ్బిలి: బొబ్బిలి యాదవ వీధిలో పూజలందుకున్న నూకాలమ్మ



బొబ్బిలి: గొల్లపల్లిలో ప్రత్యేకాలంకరణలో దాడితల్లి



వంగర: రుషింగి దుర్గాదేవి ఆలయంలో భక్తుల రద్దీ



రామభద్రపురం: రామభద్రపురంలోని సాయినగర్‌లో దుర్గామాత ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

వైఎస్సార్ సీపీతోనే సామాజిక న్యాయం

- జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు



మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

రామభద్రపురం: వైఎస్సార్ సీపీతోనే సామాజిక న్యాయం సాధ్యమని జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ దేశ చరిత్రలో బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి పెద్దపీట వేసిన ఏకైక నాయకుడు సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మాత్రమేనన్నారు. బీసీ డిక్లరేషన్‌తో ఆయన సరికొత్త చరిత్రకు నాంది పలికారన్నారు. అణగారిన వర్గాల బతుకుల్లో వెలుగులు నింపి రాజకీయ, సామాజిక, ఆర్థిక ఎదుగుదలకు ఎన్నో అవకాశాలను వైఎస్సార్ సీపీ ప్రభుత్వం కల్పించందన్నారు. ఒకప్పుడు ప్రభుత్వ పథకాలు కోసం అధికారులు, కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరగాల్సిన దుస్థితి ఉండేదన్నారు. ఇప్పుడు అలా లేదన్నారు. గ్రామాల్లోని సచివాలయ, వలంటీర్ వ్యవస్థల ద్వారా ప్రజల వద్దకే ప్రభుత్వ సేవలు, పథకాలు వస్తున్నాయన్నారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీల్లో 99 శాతం హామీలను జగనన్న ప్రభుత్వం నెరవేర్చిందన్నారు. వైఎస్సార్ సీపీ హయాంలో ప్రజలకు జరిగిన మేలు, అభివృద్ధి, సంక్షేమాన్ని వివరించేందుకు సామాజిక బస్సుయాత్ర చేపడుతున్నామని చెప్పారు. స్కిల్ స్కాంలో చంద్రబాబు అరెస్టయిన తర్వాత ప్రజల్లోను, టీడీపీ కేడర్‌లో స్పందన లేకపోవడంతో లేఖ పేరిట చినబాబు డ్రామాలు ఆడేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. చినబాబు, ప్యాకేజీ బాబుల భవిష్యత్‌కే గ్యారంటీ లేదని, వారు ప్రజల భవిష్యత్‌కు ఏమి గ్యారంటీ ఇవ్వగలరన్నారు. ఉత్తరాంధ్ర అభివృద్ధికి సీఎం జగన్ విశాఖపట్టణం నుంచి పరిపాలన చేసేందుకు ఏర్పాట్లు చేస్తుంటే దానిపైనా ఎల్లో మీడియా విషపురాతలు రాయడం చాలా విడ్డూరంగా ఉందన్నారు. రాష్ట్ర విభజన తర్వాత చంద్రబాబు దోపిడీ మినహా అభివృద్ధి ఎక్కడా జరగలేదన్నారు. టీడీపీ నేతలు ఎంతగా దుష్ప్రచారం చేస్తున్నా ప్రజల నుంచి సానుభూతి రాకపోవడంతో టీడీపీ నేతలు మైండ్ బ్లాక్ అవుతోందన్నారు. చినబాబు, ప్యాకేజీ బాబులు ఎన్ని యాత్రలు చేసినా 2024 ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయాన్ని అడ్డుకోలేరన్నారు. ప్రతీ కుటుంబం వైఎస్సార్‌సీపీని మళ్లీ ఆశీర్వదించి, అధికారంలోకి తీసుకువచ్చేందుకు సిద్ధంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు, జెడ్పీటీసీ అప్పికొండ సరస్వతి, బొబ్బిలి ఎంపీపీ ప్రతినిధి శంబంగి వేణుగోపాలనాయుడు, పార్టీ మండల అధ్యక్షుడు అప్పికొండ లక్ష్మంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

ట్యాంకర్‌తో తాగునీటి సరఫరా



ట్యాంకర్ వద్ద నీటిని పడుతున్న మహిళలు

రాజాం సిటీ: మండలంలోని మొగిలివలస గ్రామంలో యువత ఆధ్వర్యంలో మంగళవారం మంచినీటి సరఫరా చేశారు. రాజాం ప్రధాన రహదారి విస్తరణలో భాగంగా జీఎంఆర్ కేర్ జంక్షన్ వద్ద పైపులైన్ మరమ్మతులకు గురికావడంతో గత ఇరవై రోజులుగా గ్రామానికి కుళాయిల ద్వారా నీటి సరఫరా నిలిచిపోయింది. అధికారులకు నీటి సరఫరా విషయమై పలుమార్లు విన్నవించుకున్న ఫలితం లేకపోవడంతో యువకులు లెంక అప్పలనాయుడు, లెంక గణేష్, మజ్జి హరి, మీసాల అనీల్, మజ్జి జనలు తమ సొంత నిధులతో నీటి సరఫరా చేసేందుకు ముందుకొచ్చారు. మంగళవారం నుంచి ట్యాంకర్‌తో నీటిని సరఫరా చేయడంతో గ్రామస్తులకు కొంత ఊరట లభించింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి పైపులైన్ మరమ్మతులు చేసి తాగునీటి సరఫరాను పునరుద్ధరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

పండ్ల తోటల్లో కందకాల ఏర్పాటు



నాయరాళ్లవలసలో పండ్ల తోటలకు వేసిన కందకాలను పరిశీలిస్తున్న ఏపీఓ హరనాథ్

రేగిడి: ఉపాధిహామీ పథకం ద్వారా రైతులు సాగు చేస్తున్న పండ్ల తోటలకు కందకాలను ఏర్పాటు చేసుకోవాలని ఏపీఓ ఎస్.హరనాథ్ సూచించారు. మండలంలోని నాయరాళ్లవలస, లచ్చన్నవలస, గుళ్లపాడు, ఉంగరాడ తదితర గ్రామాల్లో రైతులు పండ్ల తోటలకు ఏర్పాటు చేస్తున్న కందకాలను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం రైతులకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందన్నారు. కందకాలు ఏర్పాటు చేసుకోవడం వలన దిగుబడులు పెరగడంతో పాటు మొక్క ఆరోగ్యవంతంగా ఉంటుందన్నారు. వర్షాలు కురిసేటప్పుడు నీటిని నిల్వ చేసుకునేందుకు ఈ కందకం ఎంత ఉపయోగపడుతుందన్నారు.

పంటపొలాలకు రోడ్డు నిర్మాణం



కొత్తగా నిర్మించిన గ్రావెల్ రోడ్డు

రేగిడి: మండలంలోని వండానపేట గ్రామంలోని పంటపొలాలకు రహదారిని ఏర్పాటుచేశారు. పంచాయతీ సర్పంచ్ వియ్యపు లావణ్యచక్రపాణి పంచాయతీ నిధులతో కొత్తగా రోడ్డు నిర్మాణం చేపట్టారు. వ్యవసాయ పనుల్లో భాగంగా రైతులు తమ పంటపొలాలకు వెళ్లేందుకు సరైన రహదారి లేక ఇబ్బందులు పడుతున్నారు. సమస్యను గుర్తించిన సర్పంచ్ రూ.2 లక్షలు ప్రతిపాదనలతో కిలోమీటరు మేర గ్రావెల్ రోడ్డును నిర్మించినట్లు తెలిపారు.

పంట తెగుళ్లపై అప్రమత్తం

వంగర: పంటదశకు చేరుకున్న వరిపంటకు తెగుళ్లు ఆశించకుండా చూసుకోవాలని ఏఓ తట్టికోట కన్నబాబు అన్నారు. మండలంలోని మద్దువలసలో మంగళవారం పర్యటించి వరిపంట పొలాలను పరిశీలించారు. వెన్నుదశలో సోకే తెగుళ్లపై రైతులకు అవగాహన కల్పించారు. తెగుళ్లను సకాలంలో గుర్తిస్తే పంటనష్టాన్ని నివారించొచ్చన్నారు.

సీఎం జగన్‌తోనే గ్రామస్వరాజ్యం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు

- ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు

బొబ్బిలి: సీఎం జగన్‌మోహన్‌రెడ్డితోనే మహాత్మా గాంధీ కలలుగన్న గ్రామస్వరాజ్యం సాధ్యమని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు అన్నారు. సోమవారం స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో పార్టీ మండల అధ్యక్షుడు ఉత్తరావిల్లి అప్పలనాయుడు అధ్యక్షతన జరిగిన వై ఏపీ నీడ్స్ జగన్(ఆంధ్రప్రదేశ్‌కు జగన్ ఎందుకు కావాలి) కార్యక్రమ సన్నాహక సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే పార్టీ శ్రేణులను దిశానిర్దేశం చేశారు. దేశాభివృద్ధికి పల్లెలే పట్టుగొమ్మలని మహాత్మాగాంధీ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, అబ్దుల్ కలాం, అమర్త్యసేన్, అభిజిత్ వంటి మహానుభావులు భావించారని, ఆ మహనీయుల అడుగుజాడల్లో సీఎం జగన్ నడిచి, అందరి అభివృద్ధి, సంక్షేమానికి అహర్నిశలు శ్రమిస్తున్నారన్నారు. గ్రామాల్లోని సచివాలయ, వలంటీర్ వ్యవస్థల ద్వారా ప్రజల వద్దకే పారదర్శకంగా ప్రభుత్వ సేవలు, సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. నవంబరు 1వ తేదీ నుంచి వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని ప్రతీ సచివాలయం పరిధిలో పక్కాగా నిర్వహించాలని సూచించారు. ప్రతీ ఇంటికి వెళ్లి, వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ద్వారా ప్రజలకు జరిగిన మేలును వివరించాలన్నారు. అలాగే గతంలో టీడీపీ ప్రజలను మోసం చేసిన తీరును కూడా విశదీకరించాలన్నారు. అధికారంలోకి వచ్చిన నాటి నుంచి అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పాలన కొనసాగుతోందన్నారు. ఈ నాలుగున్నరేళ్లలో రాష్ట్రంలోని ప్రతీ వర్గానికి జగనన్న ప్రభుత్వం ద్వారా లబ్ధి జరిగిందన్నారు. అందుకే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా ఇంటింటికీ వెళ్లగలుగుతున్నామన్నారు. వచ్చే ఎన్నికల్లోనూ వైఎస్సార్ సీపీ విజయమే లక్ష్యంగా ప్రతీ కార్యకర్త పనిచేయాలన్నారు. ప్రజలకు అన్యాయం చేసిన చంద్రబాబు ఆయనకు వత్తాసు పలుకుతున్న ఎల్లోమీడియా, ప్యాకేజీ స్టార్ పవన్ కల్యాణ్‌ను ప్రజలు ఎప్పటికీ నమ్మరన్నారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయఢంకా మోగించడం ఖాయమన్నారు. అనంతరం గ్రామ స్థాయిలోని నాయకులకు వై ఏపీ నీడ్స్ జగన్ మెటీరియల్‌ను పంపిణీ చేశారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్, జేసీఎస్ కన్వీనర్ తమ్మిరెడ్డి దామోదరరావు, శంబంగి వేణుగోపాలనాయుడు, ఎంపీపీ శంబంగి లక్ష్మి, వైస్ ఎంపీపీ అరసాడ శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత



రొంపల్లి అయ్యప్పస్వామి సన్నిధిలో పూజలు చేస్తున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసరావు

రామభద్రపురం: ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత అని, ప్రతిఒక్కరూ ఆధ్యాత్మిక భావాలు పెంపొందించుకోవాలని జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు అన్నారు. మండలంలోని రొంపల్లిలో వైఎస్సార్ సీపీ నాయకులు పువ్వల నారాయణరావు, పువ్వల మురళీమోహన్ ఆధ్వర్యంలో గ్రామస్తులు, దాతలతో పాటు ఎంపీ ల్యాడ్స్ నిధులతో నిర్మించిన అయ్యప్పస్వామి సన్నిధి ప్రారంభోత్సవానికి జెడ్పీ చైర్మన్, ఎంపీ, ఎమ్మెల్యే సోమవారం విచ్చేశారు. స్వామి సన్నిధిలో నిర్మించిన 18 మెట్లపై ఏర్పాటు చేసిన దీపాలు వెలిగించి, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వారు సన్నిధి ప్రాంగణంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు, జెడ్పీటీసీ అప్పికొండ సరస్వతి, పార్టీ మండల అధ్యక్షుడు అప్పికొండ లక్ష్మంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలి

- చిన్నశ్రీను సోల్జర్స్ సంస్థ జిల్లా అధ్యక్షురాలు మజ్జి సిరిసహస్ర



నందబలగలోని కనకదుర్గమ్మ ఆలయంలో పూజలు చేస్తున్న చిన్నశ్రీను సోల్జర్స్ జిల్లా అధ్యక్షురాలు మజ్జి సిరిసహస్ర దంపతులు

తెర్లాం: జిల్లాలో చిన్నశ్రీను సోల్జర్స్ సంస్థ ఆధ్వర్యంలో చేపడుతున్న సేవా కార్యక్రమాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు కుమార్తె, చిన్నశ్రీను సోల్జర్స్ సంస్థ జిల్లా అధ్యక్షురాలు మజ్జి సిరిసహస్ర కోరారు. మండలంలోని నందబలగ గ్రామంలోని కనకదుర్గ అమ్మవారి ఆలయానికి సోమవారం తన భర్త బద్దుకొండ ప్రదీప్‌నాయుడుతో కలిసి ఆమె విచ్చేశారు. ఈ సందర్భంగా స్థానిక చిన్నశ్రీను సోల్జర్స్ సంస్థ ప్రతినిధులు, గ్రామస్తులు, పెద్దలు, కనకదుర్గమ్మ ఆలయ కమిటీ సభ్యులు, వేదపండితులు వారికి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ఆమె భర్త ప్రదీప్‌నాయుడుతో కలిసి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన భారీ అన్నదాన కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలందరినీ కనకదుర్గమ్మ చల్లగా చూడాలని ప్రత్యేక పూజలు చేశామన్నారు. తమ సంస్థ పేరిట జిల్లాలో అనేక సేవా కార్యక్రమాలు జరుగుతున్నాయని, వాటిని ప్రజలు ఉపయోగించుకోవాలన్నారు. జిల్లాలో ఎటువంటి సేవా కార్యక్రమాలు చేయడానికైనా, ప్రజల కష్టసుఖాల్లో పాలుపంచుకోవడానికైనా చిన్నశ్రీను సోల్జర్స్ సంస్థ ఎప్పుడూ ముందుంటుందన్నారు. కార్యక్రమంలో తెర్లాం మండల మాజీ ఎంపీపీ యర్రా రామినాయుడు, సర్పంచ్ గిరిడిబిల్లి పైడితల్లి, ఉపసర్పంచ్ గుల్లిపల్లి శ్రీనివాసరావు, చిన్నశ్రీను సోల్జర్స్ సంస్థ జిల్లా ఉపాధ్యక్షులు తోట వాసు, కార్యదర్శి జాకీర్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

బస్‌స్టేషన్ నిర్మాణానికి కొలతలు



బస్‌స్టేషన్ నిర్మాణానికి కొలతలు వేస్తున్న సిబ్బంది

రాజాం: పట్టణంలో ఆర్‌టీసీ కాంప్లెక్స్ పక్కన ప్రభుత్వ స్థలంలో బస్‌స్టేషన్ భవన నిర్మాణానికి మంగళవారం కొలతలు వేశారు. ఇక్కడ బస్‌స్టేషన్ నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం మూడు నెలల కిందట రూ.1.80 కోట్లు నిధులు మంజూరు చేసింది. రాష్ట్ర మంత్రులు బొత్స సత్యనారాయణ, పినిపే విశ్వరూప్ తదితరులు శంకుస్థాపన కూడా చేశారు. ప్రస్తుతం అన్ని అనుమతులు రావడంతో 1.42 ఎకరాల స్థలంలో 10 ప్లాట్ ఫామ్‌లతో బస్‌స్టేషన్ నిర్మించనున్నారు. 126 బస్సులు నిలిపేందుకు వీలుగా, రోజుకు సుమారు 25 వేల మంది ప్రయాణికులు రాకపోకలు సాగించేందుకు అనువుగా దీన్ని నిర్మిస్తున్నట్లు ఆర్‌టీసీ డీఈఈ టీవీ శ్రీనివాసరావు తెలిపారు. కార్యక్రమంలో టీపీఓ ప్రమీలారాణి, ఆర్‌టీసీ సూపర్‌వైజర్ కంబాల అశోక్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

జెడ్పీటీసీ సామాజిక సేవ

రాజాం: జెడ్పీటీసీ సభ్యుడు బండి నర్సింహులు సామాజిక సేవా భావాన్ని చాటుకున్నారు. మండలంలో పెనుబాక గ్రామంలో అమృత సరోవర్ చెరువు గట్టుపై వేసిన కొబ్బరిచెట్ల సంరక్షణ బాధ్యతను తీసుకున్నారు. ట్యాంకర్ సాయంతో లేదంటే ఇంజిన్‌తో చెరువు నీటిని తోడి మొక్కలకు పోస్తున్నారు. సుమారు 150 కొబ్బరి మొక్కల సంరక్షణ బాధ్యతలను తీసుకున్నట్లు జెడ్పీటీసీ తెలిపారు.